క్లుప్తంగా

ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం

దొర్నిపాడు: ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తహసీల్దార్ సుభద్ర, ఎంపీడీఓ సావిత్రి సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎదైనా సమస్యలు వచ్చినప్పుడు క్షేత్రస్థాయికి వెళ్లి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అలాగే పాస్‌పుస్తకాల జారీ, విద్యార్థులు ధ్రువీకరణ పత్రాల మంజూరును వేగవంతం చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని ఈఓపీఆర్డీ సులోచన గ్రామ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

నకిలీ విత్తనాలపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న సోమన్న

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో నకిలీ విత్తనాలు తయారు చేసే సీడ్ ప్లాంట్లపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న, సహాయ కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. సీడ్ ఆర్గనైజర్లు నకిలీలకు బ్రాండ్ అంబాసిడర్లుగా మారారని ఆరోపించారు. నకిలీ విత్తనాల వల్ల నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నకిలీ విత్తనాలపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామన్నారు. రైతులు హుసేన్ వలి, మహమ్మద్ హుసేన్, బాషా, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

కలప ట్రాక్టర్ బోల్తా


బోల్తాపడిన కలప ట్రాక్టర్

బేతంచెర్ల: పట్టణ సమీపంలోని బనగానపల్లె రహదారిలో సోమవారం కలప ట్రాక్టర్ బోల్తా పడింది. బేతంచెర్ల నుంచి బనగానపల్లె వైపు కలప లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌కు గొర్రెల మంద అడ్డురావడంతో డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. ట్రాక్టర్‌పైన ఉన్న కూలీలు అప్రమత్తమై కిందకు దూకడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం ప్రైవేట్ వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

బనగానపల్లె: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురు గా ఉన్న నూకల రెసిడెన్సీలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. సోమవారం రెసిడెన్సీలో పేకాట ఆడుతు న్నట్లు సమాచారం రావడంతో దాడి చేసినట్లు చెప్పారు. మధుసూదన్, జగత్‌విఖ్యాత్‌రెడ్డి, బి.వెంకటేశ్వరరెడ్డి, ఎస్. మల్లికార్జున రెడ్డి, శివప్రకాష్‌రెడ్డి, బాలకృష్ణలను అరెస్టు చేసి వారి వద్ద రూ.9400ల ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

కార్తీక మాసోత్సవాలు విజయవంతం


మాట్లాడుతున్న డీఎస్పీ రామాంజి నాయక్

శ్రీశైలం: జిల్లా పోలీసు యంత్రాంగం సహకారంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కార్తీక మాస ఉత్సవాలను విజయవంతం చేశామని ఆత్మకు డీఎస్పీ రామాంజి నాయక్ తెలిపారు. సోమవారం వన్ టౌన్ పోలీస్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్సవాలకు హోంగార్డులు మొదలుకొని కానిస్టేబుల్స్, హెడ్ కానిస్టేబుల్స్, ఏఎస్ఐలు, ఎస్ఐలు, సీఐలు, డీఎస్పీలు కలిపి మొత్తం 400 మందితో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. మూడు పోలీసు బృందాలను మూడు షిఫ్టులలో వినియోగించామన్నారు. ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ ఐలాండ్‌లను ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలు క్రమబద్ధీకరించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ఉత్సవాలను విజయవంతం చేసినందుకు సీఐ ప్రసాద్‌రావును అభినందించారు. సమావేశంలో టూటౌన్ సీఐ చంద్రబాబు పాల్గొన్నారు.

ఆత్మహత్య కేసు పునర్విచారణ

ఔటర్ రింగ్ రోడ్ సమీపంలోని చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఎస్టీ కాలనీకి చెందిన సంతోష్ నాయక్(25) కేసును పునర్విచారణ చేపట్టినట్లు డీఎస్పీ రామాంజినాయక్ తెలిపారు. ఎస్టీ కమిషన్ ఆదేశాలతో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించామన్నారు. స్థానికులను అడిగి వివరాలు సేకరించామన్నారు. సాంకేతిక సమస్యలు కూడా ఇందులో ఉన్నాయని, వాటిని ధ్రువీకరించుకోవడానికి మృతుడి సెల్ ఫోన్‌ను మంగళగిరి కేంద్ర పోలీస్ కార్యాలయానికి పంపించామన్నారు. మృతుని తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నప్పటికీ ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదన్నారు. విచారణ కొనసాగుతుందని, త్వరలోనే యువకుడిది ఆత్మహత్యా, లేక హత్యా అనేది తేల్చుతామన్నారు.

ఫెంగల్.. రైతన్న దిగులు

ఉయ్యాలవాడ: ఫెంగల్ తుఫాన్‌తో కురుస్తున్న వర్షాలకు అన్నదాతలు అతలాకుతలం అయ్యారు. చేతికి వచ్చే దశలో ఉన్న వరి పంట వర్షార్పణం కావడంతో దిక్కుతోచని స్థితిలో ప్రభుత్వ సహాయం కోసం ఎదురు చూస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం నుంచి వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని ఆకాశంలో సూర్యుడు బయటకు వచ్చాడు. దీంతో రహదారులు, కళ్లాల్లో వరి ధాన్యంపై రైతులు పట్టలు తొలగించి ఆరబోసుకున్నారు. మండల పరిధిలో కుందూనది తీరం వెంట అల్లూరు, మాయలూరు, రూపనగుడి, ఉయ్యాలవాడ, హరివరం, నర్సిపల్లె, పెద్దయమ్మనూరు, కాకరవాడ, బోడెమ్మనూరు, తదితర గ్రామాల్లో రైతులు వరి సాగుపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో 1100 హెక్టార్లలో వరి సాగు చేశారు. నారు నాటినప్పటి నుంచి కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చాడు. ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.35 వేల వరకు పెట్టుబడులు పెట్టారు. వారి ఆశలకు తగ్గట్టుగానే పైరు ఏపుగా పెరిగి కంకి బాగా కట్టింది. పంట బాగుంది. తమ కష్టాలు గట్టెక్కుతాయని అనుకుంటున్న తరుణంలో వరుణుడు రైతన్నల ఆశలపై నీళ్లు చల్లాడు. నేలవాలిన వరి కోత కోసేందుకు ఎకరాకు రూ.10 వేలకు పైగా ఖర్చు చేయాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కౌలు రైతులు ముందస్తుగా ఎకరాకు రూ.25 వేలు చెల్లించి పంట సాగు చేశారు. మళ్లీ అప్పు చేసి దిగుబడులును కాపాడుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అలాగే వదిలేస్తే మొలకలు వస్తాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.


రూపనగుడి సమీపంలో నేలవాలిన వరి పైరు


మాయలూరు సమీపంలో వరి ధాన్యాన్ని ఆరబెట్టిన రైతులు

రైతన్నలకు వణుకు

రుద్రవరం: ఫెంగల్ తుపాను మండలంలోని రైతులను వణికిస్తోంది. సోమవారం తెల్లవారుజాము నుంచి ఈదురు గాలులతో ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో రైతులు వరి కోతలను నిలిపేశారు. రోడ్లపై ఆరబోసుకున్న ధాన్యం తడిసిపోకుండా పట్టలు కప్పారు. పొలాల్లో కోత దశలో ఉన్న వరి పైరు నేలవాలుతుందని, గింజలు రాలిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.


రుద్రవరంలో రోడ్డుపై నిలిచిన వరికోత యంత్రాలు

11న సర్టిఫికెట్ వెరిఫికేషన్

నంద్యాల(వ్యవసాయం): ఏపీఎస్ ఆర్టీసీకి గత నవంబర్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న నంద్యాల జిల్లా ఐటీఐ అభ్యర్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరుకావాలని జోనల్ సిబ్బంది శిక్షణా కళాశాల ప్రిన్సిపాల్ నజీర్ అహమ్మద్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీజిల్ మెకానిక్ ట్రేడ్ అభ్యర్థులు డిసెంబర్ 11వ తేదీ ఉదయం 11 గంటలకు, అదే విధంగా మోటారు మెకానిక్, ఎలక్ట్రీషియన్ వెల్డర్, పెయింటర్, డ్రాఫ్ట్‌మెన్ తదితర వాటికి దరఖాస్తు చేసుకున్న వారు అదే తేదీ మధ్యాహ్నం 2 గంటలకు హాజరు కావాలని సూచించారు. అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, క్యాస్ట్, స్పోర్ట్స్, పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, తదితర గుర్తింపు కార్డులను వెంట తీసుకొనిరావాలన్నారు. మరిన్ని వివరాలకు 28518-257025 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

కార్తీక మాసం ముగింపు వేడుక

రుద్రవరం: కార్తీక మాసం వేడుకలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా రుద్రవరంలోని భాస్కర నందీశ్వర స్వామి ఆలయంలో నిర్వాహకులు వన భోజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే అఖిలప్రియ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్వామిఅమ్మవార్లకు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. అనంతరం భక్తాదులకు భోజనం వడ్డించారు.

భక్తిశ్రద్ధలతో పోలి పాడ్యమి


నంద్యాల చిన్నచెరువు కట్ట వద్ద కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

నంద్యాల(వ్యవసాయం): కార్తీక మాసం చివరి రోజు పోలి పాడ్యమి వేడుకలను సోమవారం మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తెల్లవారుజామునే కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. స్థానిక చిన్నచెరువు కట్ట వద్ద కుందూనది వద్ద దీపాలను వెలిగించారు. ఈ సందర్భంగా వేదపండితులు రమేష్ శాస్త్రీ మాట్లాడుతూ కార్తీక పాడ్యమి రోజున అరటి దొప్పల్లో దీపాలు వెలిగిస్తే కార్తీక మాసం వ్రతం చేసిన ఫలితం లభిస్తుందని చెప్పారు. అలాగే ఆలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సోలార్ రూఫ్ టాప్‌తో విద్యుత్ బిల్లు ఆదా

నంద్యాల: ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం కింద గృహ వినియోగదారులు సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం రాయితీ కల్పిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి వివరించారు. సోమవారం పీఎం సూర్యఘర్ పథకం పోస్టర్‌లను సంబంధిత శాఖల అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గృహ వినియోగదారులు సోలార్ రూఫ్‌టాప్ ద్వారా విద్యుత్ బిల్లులను తగ్గించుకోవచ్చన్నారు. ఒక కిలోవాట్ సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుకు 100 చదరపు అడుగుల స్థలం అవసరమన్నారు. నెలకు 130 యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతుందని, ఇందుకు రూ.60-70 వేల వరకు ఖర్చవుతుండగా కేంద్ర ప్రభుత్వం రూ.30 వేల రాయితీ కల్పిస్తుందని చెప్పారు. నెలకు రూ.1000 విద్యుత్ బిల్లు వచ్చే వారికి సోలార్ ఏర్పాటు తర్వాత రూ.338 బిల్లు మాత్రమే వస్తుందని వివరించారు. 2 కిలోవాట్ల సోలార్ రూఫ్ టాప్‌కు రూ.60 వేలు రాయితీ, 3 కిలోవాట్ల సోలార్ రూఫ్‌టాప్‌కు రూ.78 వేల రాయితీ లభిస్తుందని చెప్పారు. ఆసక్తి ఉన్నవారు www. pmsuryaghar. gov.in/ APSPDCL వెబ్‌సైట్ ద్వారా పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. నెడ్‌క్యాప్ డెవలప్‌మెంట్ అధికారి వీరేంద్రబాబు, విద్యుత్తు శాఖ ఎస్ఈ జి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

రెడ్‌క్రాస్ అభివృద్ధికి కృషి

జిల్లాలో ప్రతిఒక్కరూ రెడ్‌క్రాస్ సొసైటీలో సభ్య త్వం పొంది సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యత్వ నమోదుపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. రెడ్ క్రాస్ సొసైటీలో సభ్యత్వ నమోదుకు అధికారులు తమ శాఖల ద్వారా కృషి చేయాలన్నారు. 2025 జనవరి నాటికి ప్రతి నియోజకవర్గంలో 1000కి పైగా సభ్యత్వాలు నమోదయ్యేలా లక్ష్యాన్ని నిర్దేశించారు. తద్వారా ప్రతి నియోజకవర్గ కేంద్రంలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో బ్లడ్ స్టోరేజ్ సెంటర్, డిజాస్టర్/ఫస్ట్ ఎయిడ్ శిక్షణ కేంద్రం, రెడ్‌క్రాస్ కార్యాలయం ఏర్పాటు చేసి అన్ని ప్రాంతాల్లో ప్రజలకు సేవలు అందేలా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. రెడ్‌క్రాస్‌లో రూ.25 వేలు చెల్లించి ప్యాట్రన్ సభ్యులుగా, రూ.12,500 చెల్లించి వైస్ ప్యాట్రన్ సభ్యులుగా, రూ.1100 చెల్లించి లైఫ్ మెంబర్స్‌గా చేరవచ్చన్నారు. ప్యాట్రాన్, వైస్ ప్యాట్రాన్‌గా చేరిన వారికి రెడ్‌క్రాస్ జాతీయ అధ్యక్షుడు/గౌరవ రాష్ట్రపతి ద్వారా అభినందన లెటర్ అందుతుందని చెప్పారు. అనంతరం జిల్లాలోని సంక్షేమ హాస్టళ్ల విద్యార్థుల కొరకు రెడ్‌క్రాస్ సొసైటీ 95 బెడ్‌షీట్లను అందించగా కలెక్టర్ వాటిని సంబంధిత అధికారులకు అందజేశారు. డీఆర్‌ఓ రామునాయక్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ దస్తగిరి, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఉస్మాన్‌బాషా, రెడ్ క్రాస్ ఆర్గాన్ డోనేషన్ మోటివేషన్ కో-ఆర్డినేటర్ ఆనంద్ గురూజీ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారులు మోసం చేస్తున్నారని రైతుల ఫిర్యాదు


పోలీస్‌స్టేషన్‌కు తరలివచ్చిన రైతులు

డోన్ టౌన్: ఆరుగాలం కష్టపడి పంటలు పండించి మార్కెట్‌కు తరలిస్తే వ్యాపారులు తుకాల్లో మోసాలకు పాల్పడుతూ తమ కడుపు కొడుతున్నారని వందల సంఖ్యలో రైతులు సోమవారం పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణంలోని కర్నూలు, నంద్యాల రెండు రైల్వేగేట్ల మధ్య ఉన్న పూల మార్కెట్ వ్యాపారులు పాత పద్ధతిలో తుకాలు వేస్తూ దోపిడీకి పాల్పడడంతో రైతుల్లో ఒక్కసారిగా ఆక్రోషం చోటు చేసుకుంది. ప్రతి 10 కేజీలకు రెండు కేజీల తరుగు తీసివేస్తూ వచ్చిన పట్టీలో (బిల్లు) కమీషన్ తీసుకుంటున్నారని ధర్మారం, కొచ్చెర్వు, గోసానిపల్లె, కన్నపకుంట గ్రామాలతో పాటు ప్యాపిలి, బేతంచెర్ల మండలాలకు చెందిన రైతులు ఆరోపించారు. చేతి కాటాలతో మోసం చేస్తున్నారన్నారు. స్పందించిన సీఐ ఇంతియాజ్ బాషా తూనికలు కొలతల అధికారి ఖాజా మోహిద్దీన్‌తో కలిసి పూల మార్కెట్ వ్యాపారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. భవిష్యత్‌లో ఇలాంటి చర్యలు పునరావృతం అయితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నేటి నుంచి ఎలక్ట్రానిక్ కాటాలు

పూల మార్కెట్‌లో మంగళవారం నుంచి ఎలక్ట్రానిక్ కాటాలు వినియోగించాలని సీఐ ఇంతియాజ్ బాషాతో పాటు తూనికలు కొలతల అధికారి ఖాజా మోహిద్దీన్ పూల వ్యాపారులను ఆదేశించారు.

6న వృషభాల రాతిదూలం పోటీలు

సంజామల: కాశిరెడ్డి నాయన 29వ ఆరాధన మహోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 6వ తేదీ ఆకుమల్లలో న్యూ కేటగిరి వృషభాల రాతి దూలం పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పోచా శంకర్ రెడ్డి, మాళీశ్వర్‌రెడ్డి తెలిపారు. విజేతలకు వరుసగా రూ.60 వేలు, రూ. 50 వేలు, రూ.40 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు అందజేస్తామని వెల్లడించారు. ఆసక్తి ఉన్న వృషభాల యజమానులు నిర్వాహకులను సంప్రదించాలని పేర్కొన్నారు.

ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి


కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా రేకుల షెడ్లలో నిర్వహిస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ రాజకుమారికి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో అందజేసినట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయుడు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మౌలిక సదుపాయాలు లేకుండా తరగతులు నడుపుతున్న సన్‌రైజ్ పాఠశాలను సీజ్ చేయాలని కోరారు. అర్హత కలిగిన అధ్యాపకులు లేకుండా, శానిటేషన్ సర్టిఫికెట్ లేకుండా షిఫ్టింగ్ అనుమతి లేకుండా పాఠశాల నిర్వహిస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తూ నడుపుతున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నంద్యాల పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సంతోష్, వెంకటేష్, సద్దాం, తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగుకు ప్రోత్సాహం

దొర్నిపాడు: పండ్ల తోటల సాగుకు రైతులు ముందుకు రావాలని ఎన్ఆర్ఈజీఎస్ ప్లాంటేషన్ సూపర్ వైజర్ రషీద్‌బాషా సూచించారు. సోమవారం మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో ఇంద్ర శివరామిరెడ్డి సాగుచేసిన నిమ్మతోటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవెలకుంట్ల క్లస్టర్‌లోని రుద్రవరం, ఆళ్లగడ్డ, ఉయ్యాలవాడ, చాగలమర్రి, దొర్నిపాడు, కొవెలకుంట్ల, సంజామల, కొనిమిగుండ్ల మండలాల్లో మామిడి, నిమ్మ, కొబ్బరి, చీని, సపోట, జామ, డ్రాగన్‌ఫ్రూట్ పంటలను 615 ఎకరాల్లో సాగు చేసినట్లు చెప్పారు. జాబ్‌కార్డు కలిగి ఉండి ఐదెకరాల్లోపు పొలం కలిగిన రైతులు అర్హులన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా ఉద్యాన పంటలకు 100 శాతం సబ్సిడీ అందిస్తున్నట్లు చెప్పారు. టెక్నికల్ అసిస్టెంట్ బషీర్, ఫీల్డ్‌అసిస్టెంట్ మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.


నిమ్మ మొక్కలను పరిశీలిస్తున్న ప్లాంటేషన్ సూపర్‌వైజర్ రషీద్‌బాషా

ఘనంగా శివపార్వతుల పల్లకీ సేవ

బనగానపల్లె: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమామహేశ్వరస్వామికి సోమ వారం పల్లకీ సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం స్వామిఅమ్మవార్లకు అభిషేకా లు, అర్చనలు, నైవేద్య సమర్పణ చేసి కర్పూర నీరాజనాలు పలికారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో కొలు వుంచి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. ఈఓ చంద్రుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు. పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


ఉత్సవ విగ్రహాలకు పూజలు చేస్తున్న అర్చకులు

ప్రజలంటే ఇంత చులకనా?


మరుగుదొడ్డి, కల్లుపెంటలు ఎదుట అన్నా క్యాంటిన్


అన్నా క్యాంటిన్‌లో భోజనం చేస్తున్న ప్రజలు

- కల్లు పెంటలు...మరుగు దొడ్డి ఎదుట అన్నా క్యాంటీన్
- మామూళ్ల మత్తులో ఎక్సైజ్ శాఖ, మున్సిపల్ అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

నందికొట్కూరు: ఆరోగ్య సూత్రాలను పాటించాల్సిన అధికారులే వాటిని గాలికి వదిలేసి మరుగుదొడ్డి, కల్లు పెంటలకు ఎదుట అన్నా కాంటీన్ ఏర్పాటు చేయడంపై ప్రజలు మండిపడుతున్నారు. క్యాంటిన్‌కు పది అడుగుల దూరంలోనే రెండు కల్లు పెంటలు ఉన్నా ఎక్సైజ్ శాఖ అధికారులు, మున్సిపల్ అధికారులు మామూళ్ల మత్తులో మునిగి చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు లేకపోలేదు. అపరిశుభ్ర వాతావరణంలో అన్నాక్యాంటీన్ ఏర్పాటు చేయడం ఎంత వరకు సబబని పలువురు ప్రశ్నిస్తున్నారు. మనుషులను పశువుల కన్నా హీనంగా ప్రభుత్వం చూస్తోందని చెప్పడానికి ఇదే నిదర్శనమని వాపోతున్నారు. దుర్వాసతో నిండిన మరుగుదొడ్డికి పది అడుగుల దూరం, నిత్యం తాగుబోతులతో ఉన్న కల్లుపెంటకు ఎదుట 10 అడుగుల దూరంలో అన్నా క్యాంటిన్ నందికొట్కూరు పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో మున్సిపాలిటీ స్థలంలో ఏర్పాటు చేస్తున్నారు. దుర్వాసన నిండిన ప్రాంతంలో అన్నా కాంటీన్ నిర్మించడం దారుణమని అంటున్నారు. కలెక్టర్ స్పందించి రెండు కల్లు అంగళ్లు, మరుగుదొడ్డిని తొలగించి ప్రశాంతమైన వాతావరణంలో అన్నా క్యాంటిన్ ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రోడ్డుపై విరిగిపడిన వృక్షం

మహానంది: మహానంది మండలం బుక్కాపురం గ్రామ సమీపంలోని చర్చి వద్ద రోడ్డుకు అడ్డంగా చెట్టు పడిపోవడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. నంద్యాల నుంచి మహానంది, మహానంది టూ నంద్యాల వెళ్లే ప్రయాణికులు, భక్తులు అవస్థలు పడ్డారు. స్థానిక యువకులు పరిస్థితిని సమీక్షించి వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు.


రోడ్డుకు అడ్డంగా విరిగిపడిన వృక్షం

ఆటో సీజ్

మహానంది: మహానంది నుంచి ఆటోలో ఎర్రచందనం తరహాలో ఉన్న కలపను తరలిస్తుండగా బొల్లవరం మెట్ట వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు అనుమానం వచ్చి తనిఖీ చేశారు. కలప దుంగలను గుర్తించి అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. మహానంది అటవీ శాఖ డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ హైమావతి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ప్రతాప్ ఘటనా స్థలానికి చేరుకొని ఆటో స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అదుపులోకి తీసుకొని గాజులపల్లె రైల్వే స్టేషన్ అటవీ డిపోకు తరలించారు.

భక్తిశ్రద్ధలతో లక్ష బిల్వార్చన


గౌరీ మోక్షేశ్వరస్వామికి బిల్వం సమర్పిస్తున్న భక్తులు

పగిద్యాల: మండలంలోని పడమర ప్రాతకోట గౌరీ మోక్షేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన లక్ష బిల్వార్చన కనుల పండువగా జరిగింది. ఉదయం గణపతి పూజ, హోమం, మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, శివపార్వతుల కల్యాణం తదితర పూజా కార్యక్రమాలను పురోహితులు రవివర్మ, బాలక్రిష్ణశర్మ, ధనుంజయ శర్మ, ప్రవీణ్ శాస్త్రోక్తంగా నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. బిల్వం ఆకులను మోక్షేశ్వరస్వామికి సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు వన భోజనం ఏర్పాటు చేశారు. బాలాజీ సేవా సంస్థ సభ్యులు భక్తులకు సేవలందించారు. గ్రామ పెద్దలు లగిశెట్టి లక్ష్మయ్య, చక్రపాణి, శేషఫణి, అంబటి శివశంకర్‌రెడ్డి నూతన కల్యాణ మండపానికి విరాళాలు అందజేసిన దాతలను ఘనంగా సన్మానించారు.


బిల్వార్చనకు తరలివచ్చిన మహిళలు

సంగమేశ్వరంలో విశేష పూజలు

కొత్తపల్లి: మండలంలోని సంగమేశ్వరంలోని ఎగువ పుష్కరఘాట్ వద్ద ఉమామహేశ్వరాలయంలో సోమవారం భక్తులు విశేష పూజలు చేశారు. ముందుగా పుష్కరఘాట్ వద్ద కృష్ణా నదిలో పుణ్యస్నానాలు చేసుకున్నారు. కృష్ణాజలాలతో ఆలయంలోని శివలింగానికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం లలితాదేవి అమ్మవారికి కుంకుమార్చన, పుష్పార్చన, మంగళహారతి ఇచ్చారు.

లోక్ అదాలత్‌లో కేసులకు సత్వర పరిష్కారం

డోన్ టౌన్: లోక్ అదాలత్ ద్వారా కేసులను సత్వరం పరిష్కరించుకోవచ్చని సీనియర్ సివిల్ జడ్జి తంగమణి అన్నారు. ఈ నెల 14వ తేదీ జరిగే మెగా లోక్ అదాలత్‌పై సోమవారం స్థానిక కోర్టు ఆవరణలో ఆర్డీఓ కేపీ నరసింహులు మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్, పట్టణంలోని బ్యాంక్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. లోక్ అదాలత్ గురించి ప్రజల్లో అవగాహన కల్పించి కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. బ్యాంకులకు సంబంధించిన మొండిబకాయిలు తదితర కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. సమావేశంలో స్టేట్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్, కెనరా బ్యాంక్, రాయలసీమ ప్రగతి గ్రామీణబ్యాంక్ మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన భజనలు

శ్రీశైలంటెంపుల్: కార్తీక మాసం సందర్భంగా గత నెల 2న శ్రీశైల దేవస్థానంలో ప్రారంభమైన శివచతుస్సప్తాహ భజనలు సోమవారంతో ముగిశాయి. కర్నూలుకు చెందిన రెండు భజన బృందాలు, కర్ణాటకకు చెందిన నాలుగు భజన బృందాలు నెల రోజుల పాటు నిరంతరాయంగా రేయింబవళ్లు అఖండ శివపంచాక్షరి నామ భజన కొనసాగించారు. ముగింపు కార్యక్రమంలో దేవస్థాన కార్య నిర్వహణాధికారి ఎస్.ఎస్.చంద్రశేఖర ఆజాద్, అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.